క్లుప్తంగా

ఘనంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. శ్రావణ నక్షత్రం సందర్భంగా ఆలయాన్ని పూలు, అరటి ఆకులు, కొబ్బరి మట్టలు, పచ్చ తోరణాలతో అలంకరించారు. ఉదయం అభిషేకం, అర్చన అనంతరం మధ్యాహ్నం ఆలయ పూజారీ పర్యవేక్షణలో శ్రీనివాస కల్యాణం జరిపించారు. వేడుకను వీక్షించేందుకు మామిడిపల్లి, జల్‌పల్లి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బడంగ్‌పేట్: నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయకహిల్స్ కాలనీ కమ్యూనిటీ హాలులో కార్పొరేటర్ బోయపల్లి దీపిక, సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా నివాసం ఉంటున్న ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేమని, వారి వలనే సమాజం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఉజ్జిని శ్రీధర్‌రావు, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కోశాధికారి శివకుమార్, కాలనీపెద్దలు రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, కమలాకర్‌రావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెమినార్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: ఈ నెల 23, 24న మున్సిపాలిటీ కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే సెమినార్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దత్తు నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఫ్యాబ్‌సిటీ వద్ద కార్మికులతో కలిసి సెమినార్ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ.. సెమినార్ మన ఆర్థిక వ్యవస్థ విధానం ప్రజల కోసమా, లాభాల కోసమా అనే అంశంపై రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, చర్చిస్తామని వెల్లడించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ హాజరు కానున్నారని వెల్లడించారు. కార్మికులు అధిక సంఖ్యలో రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, యాదగిరి, సురేష్, భారతి, కల్పన, కృష్ణవేణి, అనురాధ, పాండు, భాను పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణే ఎజెండాగా ముందుకు సాగాలి

చంచల్‌గూడ: ఆంక్షల పేరుతో హిందువుల పండుగలను అడ్డుకోవడం గత, ప్రస్తుత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, శ్రద్ధాబాద్ ప్రాంత గణేష్ ఉత్సవ సమితి నాయకుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం కుర్మగూడలో జరిగిన గణేష్ మండప నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హైందవ ధర్మ రక్షణకు శ్రద్ధాబాద్ ప్రాంతం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల పట్ల అనుచిత ధోరణి కొనసాగుతుందన్నారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు హిందూ ధర్మ రక్షణే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలన్నారు. నిమజ్జన ఉత్సవానికి అవసరమయ్యే వాహనాలను ఉత్సవ సమితి సమకూరుస్తుందని భారీ వాహనాల కోసం నిర్వాహకులు హైవేల వెంటపడి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఊరేగింపులను సకాలంలో ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, భాగ్యనగర్, శ్రద్ధాబాద్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు జగన్నాథం పాల్గొన్నారు.

సోషల్ ఇంపాక్ట్ అవార్డు ప్రదానం

మన్సూరాబాద్: కొవిడ్ సమయంలో ఎన్నో కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించిన జేసీఐ ఇండియా సంస్థ రైస్ ఎటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము, ప్రాజెక్టు త్రిషా నిర్వాహకురాలు యశస్వినీ జొన్నలగడ్డకు సోషల్ ఇంపాక్ట్ అవార్డు ప్రకటించారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఎటీఎం వద్ద సంస్థ ప్రతినిధులు సుమతి చందా, అరవింద్ అవార్డును అందజేశారు.



మీర్‌పేట: కమలానగర్ కాలనీలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కార్పొరేటర్లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు



పహాడీషరీఫ్: షేక్ జహంగీరుద్దీన్‌ను సన్మానిస్తున్న బాబు

వినాయక.. విఘ్నాలు తొలగించయ్యా

చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాడవాడలా కొలువుదీరిన లంబోదరున్ని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక విఘ్నాలు తొలగించయ్యా అని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. బాలాపూర్ గణేశుడి సన్నిధికి వీఐపీ దర్శనాలు పెరిగాయి. 9వ రోజు అయిన ఆదివారం పలువురు ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



బడంగ్‌పేట్: అరవబస్తీలో..



తుక్కుగూడ: వేణుగోపాల స్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



పహాడీషరీఫ్ గణనాథుడిని దర్శించుకున్న యూసుఫ్ ఖాద్రీ



కందుకూరు: చెన్నకేశ్వరస్వామి దేవాలయం ఎదుట వేలంలో లడ్డూను దక్కించుకున్న రాంరెడ్డి

అధికారి లేక.. రిజిస్ట్రేషన్లు కాక..

- ఇబ్బంది పడుతున్న భూ క్రయవిక్రయదారులు
- నిలిచిన తహసీల్ కార్యాలయ సేవలు
- తహసీల్దార్‌ను నియమించాలంటున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయం

మాడ్గుల: ఉన్న అధికారిని బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించలేదు. కానీ.. మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. అతను సెలవులపై వెళ్లడంతో ఆ కార్యాలయ కార్యకలాపాలు పడకేసి.. ప్రజలకు ఇబ్బందిగా మారింది. మాడ్గుల తహసీల్దార్ సునీల్ రెండు నెలల కిందట కలెక్టరేట్ కార్యాలయానికి ఏఓగా బదిలీ కాగా.. ఉప తహసీల్దార్ రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. అనారోగ్యం కారణంగా ఆయన ఈ నెల 9 నుంచి సెలవుల్లో ఉన్నారు. దీంతో నాటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా.. పని నిమిత్తం వచ్చే ప్రజలు విషయం తెలుసుకుని వెనుదిరుగుతున్నారు. సెలవుల్లో ఉన్న అధికారి ఎప్పుడు విధుల్లో చేరతారోనన్న కచ్చితమైన సమాచారం లేకపోవడంతో చాలా మంది రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకోవడం గమనార్హం.

లావాదేవిలు నిలిచిపోయాయని

తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటం, ఉప తహసీల్దార్ సెలవుల్లో వెళ్లడంతో పనులు కావడం లేదని ప్రజలు తెలిపారు. భూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకున్నవారు, క్రయవిక్రయ దారులు రిజిస్ట్రేషన్ చెయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. క్రయవిక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. రిజిస్ట్రేషన్లు నిలిచి, అత్యవసరమై.. భూములు అమ్ముకున్నవారికి, కొనుగోలు చేసిన వారు సొమ్ము చెల్లించేందుకు వెనుకాడుతుండటంతో ఆర్థికంగా సతమతవుతున్నారని వెల్లడించారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే తహసీల్దార్‌ను నియమించాలని కోరుతున్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయండి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కమలనాథులు

మంచాల: బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి లోయపల్లి గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలను మరింత చైతన్య పరిచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగయ్య గౌడ్, జిల్లా నాయకుడు కొండల్ ముదిరాజ్, స్థానిక నాయకులు బండి రాజు, శ్రీశైలం, వెంకటేశ్, రాజు, మహేశ్, గోపాల్ రాంచంద్రయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు



గాంధీ భవన్ ఆవరణలో పార్టీ శ్రేణులు

కడ్తాల్: పీసీసీ అధ్యక్షుడిగా ఆదివారం బాధ్యతలు చేపట్టిన మహేశ్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి పార్టీ శ్రేణులు గాంధీభవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కృష్ణనాయక్, మల్లేశ్‌గౌడ్, షాబుద్దీన్ తతదితరులు ఉన్నారు.

ఆలూరు రోడ్డు గుంతల పూడ్చివేత



రోడ్డును చదును చేయిస్తున్న గ్రూప్‌సభ్యులు

చేవెళ్ల: ఆలూరు రోడ్డు గుంతలను గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మొత్తం గుంతల మయంగా మారిందని పలు మార్లు అధికారులకు, పాలకులకు చెప్పిన పట్టించుకోలేదని వాపోయారు. దీంతో ఈ రోడ్డు గుండా ఏర్పడ్డ గుంతలతో స్థానికులు, వాహనదారుల ఇబ్బందులను గుర్తించి మానవత్వ దృక్పథంతో ఆలూరు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు 35 ట్రాక్టర్లతో మట్టిని పోయించి రోడ్డును చదును చేయించారు. ఇటీవల ఈ సమస్యను ఎమ్మెల్యే కాలె యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన లారీ మట్టిని పోయించి కొన్ని గుంతలను పూడ్చివేయించారని తెలిపారు. సుమారు రూ. 30వేల వరకు గ్రూప్ సభ్యులు ఖర్చు చేసి పనులు చేపట్టినట్లు వివరించారు. గ్రామంలోని హైస్కూల్‌వద్ద రోడ్డును బాగు చేయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రమేశ్, రాజు, మహేశ్, నవీన్, చిన్న, నాని, పృథ్వీరాజ్, చింటూ, ప్రశాంత్, రాహుల్, శేఖర్, నర్సింలు, డప్పు రాజు, తదితరులు పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరి

17న రచ్చబండ వినాయకుని లడ్డూ వేలం

చేవెళ్ల: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న రచ్చబండ వినాయకుని వేలంలో పాల్గొనే వారు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చేవెళ్ల రచ్చబండ వినాయక ఉత్సవ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది నుంచి కొత్తగా ఈ రూల్ అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు నిర్ణయించిన విధంగా ఈ నెల 17వ తేదీన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా ఆరోజు రాత్రి జరిగే ఈ వేలానికి ప్రత్యేకత తెలిసిందే. ఈ లడ్డూ వేలం పాట ఒక్కోసారి రాష్ట్ర స్థాయిలో, జిల్లాస్థాయిలో రూ. లక్షల్లో పలికి రికార్డులోకి వచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అందుకే ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం రోజున వేలం పాటలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుగానే వేలం పాటలో పాల్గొనే భక్తులు డిపాజిట్ చేసే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. వేలం పాటలో పాల్గొనే భక్తులు ముందుగానే ఉత్సవ కమిటీ నుంచి డిపాజిట్ రశీదును పొంది పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వనస్థలిపురం: గణపతి నవరాత్రుల సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ శారదానగర్ కాలనీలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొప్పోలు జగన్నాథరావుచే భక్త రామదాసు ఏక పాత్రాభినయం, శ్రీకృష్ణ రాయభారం పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కళా భారతి సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాథరావు, కార్యదర్శి అరుణ్‌కుమార్, యాదగిరిరావు, యజ్ఞ భగవాన్, సుబ్బారావు, ప్రసన్నాంజనేయులు, నరసింహారావు, డా.అప్పారావు, హనుమంతరావు, విష్ణుమూర్తి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోర్టు వివాదాలు పరిష్కరించాలి

చాదర్‌ఘాట్: మంఖాల్–2 డబుల్ బెడ్రూమ్ సముదాయంలో తమకు ఇళ్లు కేటాయించాలని, కోర్టులో వివాదం త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని మంఖాల్–2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు ఖాజా అన్నారు. ఆదివారం నిర్వహించిన మంఖాల్–2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యుల సమావేశంలో ఖాజా మాట్లాడుతూ.. కోర్టు వివాదాన్ని త్వరగా పరిష్కరం చేసే విధంగా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. కోర్టులో వివాదం కారణంగా ఎంపికై న లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు కేసును పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం లేదని, దీంతో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. హైకోర్టులో సింగిల్ బెంచ్ పై ఉన్న కేసును డబుల్ బెంచ్‌పై తీసుకెళ్లేందుకు లబ్ధిదారులు అందరూ ఏకమై న్యాయవాదిని సంప్రదించాలని పిలుపునిచ్చారు.

టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న షాబుద్దీన్ తదితరులు

కడ్తాల్: చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మక్తమాధారం గ్రామంలో నేను సైతం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఉత్సవ నిర్వాహకులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ కుల మతాలకతీతంగా జరుపుకొనే వేడుకల్లో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, లక్పతినాయక్, సత్యం, నర్సింహగౌడ్, నారాయణ, శ్రీకాంత్, శేఖర్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

మొయినాబాద్: పేదల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు కె రామస్వామి పేర్కొన్నారు. ఈ నెల 23, 24న తుక్కగూడలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఆదివారం మొయినాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై తమ సంఘం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, భవన నిర్మాణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, దర్శన్, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి

స్వయం ఉపాధితో రాణించాలి

దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, దోనూరి శంకరయ్య



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బోకుల లింగం, దోనూరి శంకరయ్య తదితరులు

షాబాద్: యువత స్వయం ఉపాధితో రాణించాలని దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం, వ్యాపారవేత్త దోనూరి శంకరయ్య పేర్కొన్నారు. ఆదివారం దామర్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత స్వయం ఉపాధితో ముందుకు సాగాలన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం శుభప్రదమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జయమ్మ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పొన్న నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ అర్చకులు ఎంతో వైభవంగా నిర్వహించారు. కనుల పండువగా సాగిన కల్యాణోత్సవానికి పట్టణ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి పల్లకీసేవను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయిాశ్వర్‌రెడ్డి, వేములబాల్‌రాజ్, నాగిళ్లభవానీప్రసాద్, నాగిళ్లకుమారస్వామి, పాండురంగారెడ్డి, పాలాదిశివకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం

- ఒరిగిన విద్యుత్ స్తంభాలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- ప్రమాదం జరగకముందే తొలగించాలంటున్న రైతులు





వెంకట్రావ్‌పేట్ పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

తలకొండపల్లి: పంటపొలాల్లో ఒరిగిన శిథిల విద్యుత్ స్తంభాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని వాపోతున్నారు. ప్రమాదవశాత్తు పోల్స్ నేల కూలితే.. ఆర్థిక నష్టంతో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని, మూగజీవాలకు ముప్పు వాటిల్లనుందని పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి, సాగుపై ప్రభావం చూపనుందని వెల్లడించారు.

మరమ్మతులు లేక.. శిథిలమై

మండల పరిధి వెంకట్రావ్‌పేట్ శివారు ప్రాంతంలోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. సుమారు 50 సంవత్సరాల క్రితం 11 కేవి విద్యుత్ వైర్లతో పోల్స్ ఏర్పాటు చేసినట్లు స్థానిక రైతులు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు వాటికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల్లో నిత్యం పంట పొలాల్లో ఉంటామని, ఇలా ఒక వైపు ఒరిగిన స్తంభాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. భయాందోళనతో సాగు పనులు చేసుకుంటున్నామని చెప్పారు. ఇదే విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



పంట పొలాల మధ్య ఉన్న శిథిల విద్యుత్ స్తంభాల గురించి ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అవి కూలి ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే కొత్తవి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

–సైదుపల్లివెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, వెంకట్రావ్‌పేట్

భయంగా ఉంది



పొలాల్లో కూలడానికి సిద్ధంగా ఉన్న కరెంటు స్తంభాలతో భయంగా ఉంది. ఎప్పుడు కూలుతాయోనని భయపడుతూనే పనిచేసుకుంటున్నాం. ప్రమాదవశాత్తు కూలితే 11 కేవీ వైర్లు తెగి పంట పొలాల్లో పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పాతవి తొలగించి.. కొత్తవి అమర్చాలి.

– దస్తగిరి, రైతు, వెంకట్రావ్‌పేట్

కొత్తవి లేవు..

విద్యుత్ స్తంభాలు ఒరిగిన విషయం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం కొత్త పోల్స్ లేవు. మరో వారం రోజుల్లో ఒరిగిన వాటిని సరిచేయిస్తాం. కొత్తవి రాగానే వాటి స్థానంలో వీటిని అమర్చుతాం.

– ఏడీ శ్రీనివాసులు, ఆమనగల్లు, ఏఈ కఠారియా, తలకొండపల్లి